

కిలో టమాట రూ.23

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.18 ప్రకారం ధర పలికింది.



సేవలో మరో అడుగు

అందరినీ సేవించు.. అందరినీ ప్రేమించు అన్న సత్యసాయి సూక్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సెంట్రల్ ట్రస్ట్ దివ్యాంగుల కోసం మరో అడుగు వేసింది.

8లో

గరిష్టం/కనిష్టం
35.2°/20.4°

జిల్లాలో శుక్రవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- లబ్ధిదారులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత 'దీపం -2' పథకం కింద ప్రభుత్వం ఉచితంగా అందజేసే గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా లబ్ధిదారులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తుందన్నారు. లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్‌కు ఎంత డబ్బు చెల్లిస్తారో ఆ మొత్తాన్ని 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు. కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ, 'దీపం-2' పథకం కింద నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. లబ్ధిదారులు ఆధార్ నంబరుతో గ్యాస్ కనెక్షన్, బ్యాంకు అకౌంట్ లింక్ అయి ఉండాలన్నారు. ఏవైనా సమస్యలుంటే 1967కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, ఆర్డీఓ మహేష్, హెచ్‌పీ గ్యాస్ డీలర్ గోవింద చౌదరి, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన కరువు

హిందూపురం: 'దీపం-2' పథకానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఆఫీసు వద్ద గ్యాస్‌సిలిండర్ల పంపిణీ ప్రారంభోత్సవం నిర్వహించగా, ఎంపీ పార్థసారథి హాజరయ్యారు. వేదికపై టీడీపీ నేతలు ఆశీనులు కాగా, జనం మాత్రం కరువయ్యారు. ఫలితంగా అన్నీ ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. దీంతో అప్పటికప్పుడు అధికారులు మహిళా సంఘాల సభ్యులను పిలిపించారు.

స్నేహితుల మధ్య గొడవ.. ముగ్గురికి కత్తి పోట్లు



హిందూపురం అర్బన్: స్నేహితుల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీయగా...ముగ్గురు కత్తి పోట్లకు గురయ్యారు. ఈ సంఘటన హిందూపురం పట్టణంలోని అహ్మద్‌నగర్‌లో బుధవారం రాత్రి (అక్టోబర్ 30వ తేదీ) జరిగింది. వివరాల్లోకి వెళితే... అహ్మద్‌నగర్‌కు చెందిన సల్మాన్, అలీమ్‌లు స్నేహితులు. గత బుధవారం రాత్రి ఇద్దరూ సల్మాన్ ఆటోలో కూర్చుని పిచ్చాపాటిగా మాట్లాడుకుంటుండగా విభేదాలు తలెత్తాయి. కోపోద్రిక్తుడైన సల్మాన్ తన ఆటో నుంచి కిందకు దిగమని అలీమ్‌ను గదమాయించాడు. దీంతో నొచ్చుకొన్న అలీమ్ కిందకు దిగాడు. అనంతరం తనకు బైక్ కావాలని సల్మాన్ అడగడంతో ఆటో నుంచి దింపేసి మళ్లీ బైక్ అడుగుతావా అంటూ అలీమ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇరువురి మధ్య గొడవ ప్రారంభం కాగా, అలీమ్ తమ బంధువులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఇలియాజ్, హసన్, అక్బర్ అక్కడకు చేరుకుని సల్మాన్‌తో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న సల్మాన్ అన్న ఇనాయతుల్లా కూడా కత్తులతో అక్కడికి చేరుకుని ఇలియాజ్, హసన్, అక్బర్‌పై దాడి చేశారు. గాయపడిన వారిని స్థానికులు హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.

నల్లచెరువు మండలం దేవిరెడ్డిపల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఆర్‌ఓ ప్లాంట్ చెడిపోయింది. నేటికీ మరమ్మతులు చేయలేదు. అసలు దీని గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. దీనివల్ల విద్యార్థులు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాల ప్రవేశద్వారానికి గేటు కూడా లేదు. విష పురుగులు లోపలికి వస్తున్నాయి. విద్యార్థులు భయంభయంగా గడుపుతున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. భోజన పాత్రలు మోసుకురావడం వంటి పనులను విద్యార్థులతో చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఏదైనా జరిగితే విద్యార్థులు గాయపడే ప్రమాదముంది.



నల్లచెరువు మండలం దేవిరెడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం పాత్రలను మోసుకుపోతున్న విద్యార్థులు

నల్లమాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించడం లేదు. దీంతో దాదాపు సగం మంది విద్యార్థులు ఇంటి నుంచే భోజనం క్యారియర్లు తెచ్చుకుంటున్నారు. పైగా ఆరుబయటే మట్టిలో కూర్చొని భోజనం చేయాల్సి వస్తోంది. ఇక్కడ మరుగుదొడ్ల నిర్వహణ అటకెక్కింది. ఆరుబయటకు వెళ్లి మూత్ర విసర్జన చేయాల్సి వస్తోంది.



నల్లమాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహణ లేక మూతపడిన బాలుర మరుగుదొడ్లు

సమస్యల ఒరబడి

- ప్రభుత్వ బడులపై కూటమి సర్కారు శీతకన్ను
- నిర్వహణ లేక కంపు కొడుతున్న మరుగుదొడ్లు
- సరిగా అమలు కాని మధ్యాహ్న భోజనం మెనూ
- గణనీయంగా తగ్గిన విద్యార్థుల సంఖ్య

పుట్టపర్తి: ప్రభుత్వ విద్యారంగంపై కూటమి సర్కార్ శీతకన్ను వేసింది. మౌలిక వసతులు కల్పించి.. నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరచాల్సిన ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వం 'నాడు- నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌స్థాయి విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్ది బోధనా ప్రమాణాలు పెంచింది. మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందిస్తూ.. సురక్షితమైన తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి సదుపాయాలు కల్పించింది. అమ్మ ఒడి పథకం కింద ఏడాదికి రూ.15 వేల సాయం అందించింది. పేద పిల్లల చదువులపై తల్లిదండ్రులకు భారం తగ్గింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పరిస్థితులు తలకిందులయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 2028 ప్రభుత్వ పాఠశాలల్లో 1,47,500 మంది విద్యార్థులు చదువుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలలకే ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 2011కు పడిపోయింది. విద్యార్థుల సంఖ్య 1,25,000కు తగ్గిపోయింది.



నల్లమాడ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మరుగుదొడ్ల వద్ద మట్టిలో కూర్చొని భోజనం చేస్తున్న బాల బాలికలు

దీన్ని బట్టి పేదలు చదువుకునే పాఠశాలలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తెలిసిపోతోంది.

పౌష్టికాహారంలో కోత..

ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ సరిగా అమలు కావడం లేదు. మెనూ ప్రకారం రోజుకో రకమైన భోజనంతో పాటు చిక్కీలు, కోడిగుడ్లు అందించాలి. అయితే నాలుగు నెలలుగా చిక్కీలు, కోడిగుడ్లు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు అరకొర పౌష్టికాహారంతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిక్కీలు, కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టు దక్కించుకున్న కూటమి పార్టీలకు చెందిన వారు పాఠశాలలకు పూర్తిస్థాయిలో సరఫరా చేయకుండా అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

నాడు అమోఘం.. నేడు అధ్వానం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు సకల సౌకర్యాలతో విరాజిల్లాయి. 'మన బడి నాడు-నేడు' కింద పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించారు. జిల్లాలో తొలి విడత కింద ఎంపికైన 596 పాఠశాలల్లో రూ.171.72 కోట్లు ఖర్చు చేసి..తరగతి గదుల ఆధునీకీకరణ, నూతన గదుల నిర్మాణం, బాల బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు, బెంచీలు, ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం, స్మార్ట్ టీవీలు వంటి పలు సౌకర్యాలు కల్పించారు. అలాగే రెండోవిడత కింద 1,081 పాఠశాలల్లో రూ.316.56 కోట్లతో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టారు. ఈ పనులు సాగుతున్న సమయంలోనే ప్రభుత్వం మారింది. వీటి గురించి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. కనీసం మరుగుదొడ్ల నిర్వహణను కూడా చూడడం లేదు. గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం నుంచి కొంత మొత్తాన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్ల నిర్వహణకు కేటాయించారు. స్కూల్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహణ చేపట్టేలా చూశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకరు లేదా ఇద్దరు ఆయాలను నియమించుకుని మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. ఆయాలకు కూడా కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో వారు అరకొరగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి.

విష పురుగులు వస్తున్నాయి



మా పాఠశాలకు గేటు లేకపోవటంతో విష పురుగులు వస్తున్నాయి. రాత్రివేళ భయం భయంగా గడుపుతున్నాం. వాటర్ ఫిల్టర్ పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

– భారతి, ఏడో తరగతి, ఏపీ మోడల్ స్కూల్, దేవిరెడ్డిపల్లి, నల్లచెరువు మండలం

మరుగుదొడ్లు లేక ఇబ్బంది



మా పాఠశాలలో మరుగుదొడ్లు వృథాగా ఉన్నాయి. దీనివల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఆరుబయటకు వెళ్లి మూత్ర విసర్జన చేయాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం కూడా సరిగా ఉండడం లేదు. దీంతో ఇంటి నుంచే క్యారియర్ తెచ్చుకుంటున్నాం.

– రెడ్డి లోకనాథ్, పదో తరగతి, నల్లమాడ జెడ్పీ ఉన్నత పాఠశాల

మట్టిలోనే మధ్యాహ్న భోజనం



పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవటంతో ఆరుబయట మట్టిలో కూర్చొని మధ్యాహ్న భోజనం చేస్తున్నాం. భోజనంలోకి దుమ్మూ ధూళి పడుతున్నాయి. పైగా పక్కనే మరుగుదొడ్లు ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం.

– హరిణి, ఏడో తరగతి, నల్లమాడ జెడ్పీ హైస్కూల్

ప్రభుత్వ బడుల నిర్వీర్యానికి కుట్ర



ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నారు. గత ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి పేద విద్యార్థుల చదువులను ప్రోత్సహించింది. ప్రస్తుత ప్రభుత్వం పేద విద్యార్థుల కడుపు కొట్టి పౌష్టికాహారం సరఫరా కాంట్రాక్టులు దక్కించుకున్న కూటమి నేతలకు మేలు చేసేందుకు పూనుకుంది. బడుల్లో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది.

– వేమనారాయణ, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు

పేదలకు విద్యను దూరం చేయడమే!



ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అధ్వానంగా ఉంది. ప్రభుత్వ చర్యలు చూస్తుంటే పేద పిల్లలను ఉచిత విద్యకు దూరం చేసేవిగా కనిపిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చి పూర్వ వైభవం తీసుకొచ్చారు. ఇప్పుడేమో అందుకు భిన్నంగా పాలన సాగుతోంది. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించింది. మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేశారు.

– గంగాధర్, విద్యార్థిని తండ్రి, బత్తలపల్లి

దేశ సమైక్యతను కాపాడాలి

- దేశాభివృద్ధికి యువత ముందుండాలి
- యూనిటీ ఫర్ రన్‌లో కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ప్రజలందరూ ఐకమత్యంతో మెలుగుతూ దేశ సమైక్యతను కాపాడాలని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న కోరారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గురువారం పుట్టపర్తిలో జాతీయ ఐక్యత దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ టీఎస్ చేతన్ ఎస్పీ రత్నతో కలిసి సత్యసాయి సూపర్ ఆస్పత్రి వద్ద యూనిటీ ఫర్ రన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్పీ కార్యాలయం వరకూ సాగింది. అనంతరం ఎస్పీ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి విద్యార్థులతో జాతీయ సమైక్యత దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పటేల్ జీవిత చరిత్రను స్మరించుకున్నారు. అనంతరం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, పరుగు పందెంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకుముందు కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, మనది భిన్నత్వంలో ఏకత్వం కలిగి దేశమని, భారతీయులంతా ఒక్కటేనన్న భావంతో మెలగాలన్నారు. విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదర్శప్రాయుడని, దేశ రక్షణకు, సమగ్రతకు ఆయన ఎంతో కృషి చేశారని కీర్తించారు. అందరూ ఆ మహనీయుడి బాటలో నడవాలని పిలుపునిచ్చారు.



జెండా ఊపి ఐక్యతా పరుగును ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

పటేల్ జీవితం యువతకు ఆదర్శం..

ఎస్పీ రత్న మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని రాష్ట్రీయ ఏక్తా దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు. స్వాతంత్ర్యానంతరం 550పైగా సంస్థానాలను దేశంలోకి విలీనం చేసి దేశ సమైక్యతకు పటేల్ కృషి చేశారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే దేశం మొత్తం ఒకటిగా ఉందన్నారు. దేశానికి పటేల్ చేసిన సేవలు గుర్తించి భారత ప్రభుత్వం 1991వ సంవత్సరంలో ఆయనకు భారతరత్న ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, డీఎస్పీ ఆర్‌ఐలు వలి, మహేష్, రవికుమార్, సీఐలు సునీత, ఇందిర, నరేంద్రరెడ్డి, బాల సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, ప్రదీప్, వీరన్నతోపాటు పలువురు అధికారులు, ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఏక్తా దివస్

ప్రశాంతి నిలయం: ప్రతి భారతీయుడు దేశ ఐక్యత, సమగ్రతకు పాటుపడాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టరేట్ సిబ్బందితో ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పౌరుడు సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

సర్వర్ సతాయింపు

- ఆలస్యంగా సాగిన పింఛన్ పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 4,836 పింఛన్లు రద్దు



పింఛన్ కోసం వేచి చూస్తున్న నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి వాసులు

పుట్టపర్తి అర్బన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లాలో ఆలస్యంగా సాగింది. ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది తెల్లవారుజామునే గ్రామాలకు వెళ్లినా సర్వర్ సమస్యతో ఉదయం పింఛన్ పంపిణీ సరిగా చేయలేకపోయారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు, రచ్చకట్టల వద్ద వేచి చూస్తూ గడిపారు. మధ్యాహ్నం నుంచి సర్వర్ పనిచేయడంతో అందరినీ ఒకేచోటకు పిలిపించి పింఛన్ మొత్తం అందజేశారు. ఈ క్రమంలో దివ్యాంగులు, వివిధ జబ్బులతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నవంబర్ నెల సంబంధించి జిల్లాలో 2,66,137 మందికి ప్రభుత్వం రూ.114.26 కోట్లు మంజూరు చేయగా, తొలిరోజు 91 శాతం పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

4,836 పింఛన్లకు కోత..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ప్రతి నెలా పింఛన్ జాబితాలో అర్హుల పేర్లు గల్లంతు అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా పింఛన్లు రద్దు వేస్తూ వచ్చింది. నవంబర్ నాటికి ఏకంగా జిల్లా వ్యాప్తంగా 4,836 మందికి పింఛన్లు రద్దయ్యాయి. దీంతో అర్హులంతా లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది జూలై నెలలో జిల్లాలో 2,70,973 మందికి పింఛన్లు ఇవ్వగా..నవంబర్ నెల నాటికి ఆ సంఖ్య 2,66,137కు తగ్గింది. కూటమి నాయకుల కుట్రతోనే పింఛన్ రద్దుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంతులీనిన ప్రశాంతి నిలయం



ఆకాశంలో బాణసంచా వెలుగులు

ప్రశాంతి నిలయం: దీపావళి పర్వదిన వేడుకలు ప్రశాంతి నిలయంలో ఘనంగా జరిగాయి. వేడుకలను పురస్కరించుకుని గురువారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి యజుర్ మందిరం వద్ద వివిధ ఆకృతులలో దీపాలు వెలిగించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు బాణసంచా కాల్చి వేడుకలు ప్రారంభించారు. అనంతరం సత్యసాయి విద్యా సంస్థల విద్యార్థులు, ఉద్యోగులు రంగు రంగుల కాంతులను వెదజల్లే టపాసులను కాలుస్తూ సందడి చేశారు.



బాణసంచా కాలుస్తూ సందడి చేస్తున్న సత్యసాయి విద్యా సంస్థల విద్యార్థులు, సిబ్బంది

ఘనంగా గుజరాతీ నూతన సంవత్సర వేడుకలు

గుజరాత్ నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతి నిలయంలో ఘనంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం గుజరాత్ భక్తులు తమ సంస్కృతీ, సంప్రదాయాలను అనుసరిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 'ది గ్లోరీ ఆఫ్ మహాశక్తి' పేరుతో సూరత్‌కు చెందిన శ్రీ సత్యసాయి స్కూల్ విద్యార్థులు నిర్వహించిన నృత్యరూపకం ఆహూతులను అలరించింది. అనంతరం అహ్మదాబాద్‌కు చెందిన బాలవికాస్ బాలికలు 'గరాబా' జానపద నృత్యంతో భక్తులను ఆకట్టుకున్నారు.



గుజరాత్ భక్తుల సాంస్కృతిక ప్రదర్శన

దీపావళి.. ఆనందాల కేళి

పుట్టపర్తి టౌన్: దీపావళి పర్వదినం సందర్భంగా గురువారం జిల్లాకు నూతన శోభ వచ్చింది. ముంగిళ్లు దీపాల వెలుగులతో కాంతులీనాయి. ఊరూవాడా బాణసంచా మోతతో హోరెత్తాయి. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ బాణసంచా పేలుస్తూ ఆనందంలో మునిగితేలారు. అలాగే ఇంటింటా, వ్యాపార సంస్థల్లోనూ లక్ష్మీ పూజలు జరిగాయి. కదిరి, హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి తదితర పట్టణాల్లోని ఆలయాల్లో లక్ష్మీ పూజలు వైభవంగా సాగాయి. దీపావళి అమావాస్య సందర్భంగా పలు ప్రాంతాల్లో సామూహిక నోములు, గౌరీ వ్రతాలను మహిళలు నియమనిష్టలతో ఆచరించారు.



గ్లోరీ ఆఫ్ మహాశక్తి నృత్యరూపకం ప్రదర్శిస్తున్న చిన్నారులు



మడకశిర సాయిబాబా ఆలయంలో లక్ష్మీపూజ చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

నవోదయ ప్రవేశ దరఖాస్తుకు 9 వరకూ అవకాశం

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో (2025–2026 విద్యాసంవత్సరం) ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు ఈనెల 9వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రస్తుతం 8, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జవహర్ నవోదయ అధికారిక వెబ్‌సైట్ నిర్వహణలో ఉన్నందున దరఖాస్తులను https://cbseitms.nic.in2024/nvsix, https://cbseitms.nic.in/nvsxi&11 వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే పంపాలని సూచించారు.

చక్రం ఊడి.. మధ్యలో ఆగి



మరమ్మతులకు గురై నిలిచిపోయిన 108 వాహనం

గుడిబండ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అలుపెరగని సేవలు అందించిన 108 అంబులెన్స్‌లు... కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఈ ఐదు నెలల కాలంలో ఎక్కడికక్కడ మొరాయిస్తున్నాయి. తాజాగా అమరాపురం మండలం హేమావతి గ్రామానికి చెందిన ఓ రోగిని శుక్రవారం అత్యవసరంగా ఆస్పత్రికి తరలించేందుకు బయలుదేరిన 108 అంబులెన్స్ మోరబాగల్ సమీపంలోకి చేరుకోగానే చక్రం ఊడిపోయింది. పైలెట్ చాకచక్యంతో వాహనాన్ని రోడ్డు పక్కకు చేర్చాడు. కాగా, అత్యవసర వైద్య చికిత్స అవసరమైన రోగిని ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి బంధువులు చేర్చారు. 108 అంబులెన్స్‌ల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించడం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. రోగుల ప్రాణాలు కాపాడడంలో కీలకమైన అంబులెన్స్‌ల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

సేవలో సత్యసాయి ట్రస్టు మరో అడుగు



కోల్పోయిన కాలుకు కొలతలు తీసుకుంటున్న వైద్యురాలు



ఎడమ చేయి పూర్తిగా కోల్పోయిన చిన్నారికి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం



దివ్యాంగులకు ఇంటి వద్దనే సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మొబైల్ వాహనం

- దివ్యాంగజన్ సేవ పేరుతో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అమరిక
- కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సత్యసాయి ట్రస్ట్
- పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలో అమలు
- ఎస్ఎస్ఎస్ దివ్యాంగజన్ యాప్ ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్


ప్రశాంతి నిలయం: సత్యసాయి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ సెంట్రల్ ట్రస్ట్ మరో అడుగు ముందుకేసింది. సమాజంలో అభద్రతకు గురవుతున్న దివ్యాంగులకు అండగా నిలిచి, వారిలో ఆత్మస్థైర్యం నిలిపేలా దివ్యాంగజన్ సేవ పేరుతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన యాప్‌ను ఈ ఏడాది గురుపౌర్ణమి సందర్భంగా సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ బృందం ఆవిష్కరించింది తొలుత పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిన సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ త్వరలో దేశవ్యాప్తంగా విస్తృతం చేసే దిశగా కార్యాచరణ మొదలు పెట్టింది.

ఇంటి వద్దకే సేవలు....

సత్యసాయి దివ్యాంగజన్ సేవ కార్యక్రమంలో భాగంగా వికలాంగులు సులువుగా సేవలు పొందేందుకు అనువుగా ఓ మొబైల్ లింబ్ కేర్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. దివ్యాంగజన్ యాప్ ద్వారా రిజిస్టేషన్ చేసుకున్న వికలాంగుల ఇంటి వద్దకే వాహనం ద్వారా వైద్య సిబ్బంది, కృత్రిమ అవయవాల తయారీ నిపుణులు వెళ్లి బాధితుల వివరాలు, కోల్పోయిన అవయవం కొలతలు తీసుకుంటున్నారు. అవయవాలను తయారు చేసిన తర్వాత నేరుగా వికలాంగుల ఇంటి వద్దకే మొబైల్ వాహనంలో వెళ్లి అక్కడే అమర్చేలా కార్యాచరణను రూపొందించారు.

వీరికి తొలి ప్రాధాన్యత..

కుటుంబ భారాన్ని మోస్తూ ప్రమాదంలో కాళ్లు, చేతులు కోల్పోయిన వారికి, ఉద్యోగం చేస్తూ వైకల్యం బారిన పడిన వారికి, విద్యార్థులకు తొలి ప్రాధాన్యతనిస్తారు. మిగిలిన వారికి రెండో ప్రాధాన్యత కింద పరిగణిస్తున్నారు. పోలియో బాధితులు,స ర్జికల్ డయాబెటిక్ గ్యాంగరిన్ సమస్య ఉన్న వారు ఈ పథకం ద్వారా సేవలు పొందేందుకు అనర్హులు. సంఖ్యతో సంబంధం లేకుండా ఎంతమందైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అర్హతను బట్టి ఉచితంగా కృత్రిమ అవయవాలను అమరుస్తారు.



ప్రత్యేక యాప్ ద్వారా సేవ..

అనుకోని ప్రమాదాలలో చేతులు, కాళ్లు పూర్తిగా పోగొట్టుకుని ఇబ్బందులు పడుతున్న వికలాంగులకు వయస్సుతో నిమిత్తం లేకుండా సత్యసాయి దివ్యాంగజన్ సేవ కార్యక్రమం ద్వారా కృత్రిమ అవయవాలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పూర్తి ఉచితంగా అందజేస్తోంది. ఈ క్రమంలో నాణ్యమైన కృత్రిమ అవయవాల తయారీకి అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎండో స్కెలిటల్ ఆర్టీఫిషియల్ అసెస్టివ్ డివైజెస్ సాయంతో సమకూర్చుకుంది. అలాగే కృత్రిమ అవయవాలను అమర్చడంలో నిష్ణాతులైన వైద్య బృందాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే ఈ సేవలను ఉచితంగా పొందాలనుకునేవారు ముందుగా సత్యసాయి దివ్యాంగజన్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. . గుగూల్ ప్లేస్టోర్ ద్వారా ఎస్ఎస్ఎస్ దివ్యాంగజన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. యాప్‌లో నమోదైన దివ్యాంగుడిని వెంటనే సేవా బృందం సభ్యులు సంప్రదించి పూర్తి వివరాలు సేకరించుకుంటారు. అనంతరం అర్హులైన వారి విరిగిన (కాళ్లు, చేతులు) అవయవాల కొలతలు తీసుకుని కృత్రిమ అవయవాలు తయారు చేస్తారు. ఒక్కో కృత్రిమ అవయవం తయారీకి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వెచ్చిస్తోంది. కృత్రిమ అవయవం అమర్చిన తర్వాత ఏదైనా సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే వెంటనే అవసరమైన సేవలు అందిస్తారు. రాబోవు రోజుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని జిల్లాలు, ఆ తర్వాత దేశ వ్యాప్తంగా మరింత మందికి సేవలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 180 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 125 మందికి అవసరమైన అవయవాలను అందుబాటులో ఉంచారు. వీరికి సత్యసాయి జయంతి సందర్భంగా బాధితులకు అమర్చనున్నారు. మిగిలిన వారి కోసం గత నెల 27 నుంచి ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టి అవయవాల కొలతలు తీసుకుంటున్నారు.

ఇదొక భాగం మాత్రమే

సత్యసాయి సేవా స్ఫూర్తి కొనసాగింపులో ఇదొక భాగం మాత్రమే. ట్రస్ట్ సేవలను మరింత విస్తరించనున్నాం. విధివంచితులైన దివ్యాంగులకు అండగా నిలవాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. వారు దత్మస్థైర్యాన్ని కోల్పోకుండా అందరితో పాటు సజావుగా జీవనం సాగించాలన్నదే మా లక్ష్యం. పైలెట్ ప్రాజెక్ట్ కింత తొలుత ఈ జిల్లాలో కార్యక్రమాలు చేపట్టాం. భవిష్యత్తులో తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశవ్యాప్తంగా కార్యక్రమాన్ని అమలు చేయనున్నాం.

– ఆర్‌జే రత్నాకర్‌రాజు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ

సత్యసాయి ఆశీస్సులతో నడవబోతున్నా..



ప్రమాదంలో నా ఎడమ కాలును కోల్పోయాను. కృత్రిమ కాలును అమర్చేందుకు ప్రైవేట్‌గా రూ.లక్ష ఖర్చు వస్తోంది. అంత డబ్బు నా వద్ద లేక ఇబ్బంది పడుతున్నా. ఇలాంటి సమయంలో సత్యసాయి దివ్యాంగజన్ సేవ గురించి తెలిసి వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకున్నా. ఇప్పుడు సత్యసాయి ట్రస్ట్ వారు నాకు ఉచితంగా కృత్రిమ కాళ్లు సమకూరుస్తున్నారు. భగవాన్ సత్యసాయి దివ్య ఆశీస్సులతో నేను మళ్లీ నడవబోతున్నా. ఎంతో సంతోషంగా ఉంది.

– డి.చిన్నప్ప, గుడిబండ

వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం అర్బన్: భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... స్థానిక తూముకుంట చెక్‌పోస్టు వద్ద నివాసముంటున్న హనుమంతు (30) మద్యానికి బానిసయ్యాడు. తరచూ మద్యం సేవించి మత్తులో ఇంట్లో భార్య, పిల్లలతో పాటు చుట్టుపక్కల వారితో గొడవ పడేవాడు. ఈ క్రమంలో మద్యం మానేయాలని పలుమార్లు భార్య లక్ష్మీదేవి వేడుకున్నా.. హనుమంతు ప్రవర్తనలో మారు రాలేదు. దీంతో విసుగు చెందిన ఆమె చిలమత్తూరులోని తన పుట్టింటికి వెళ్లి పోయేది. పెద్ద మనుషులు సర్దిచెప్పడంతో తిరిగి కాపురానికి వచ్చేది. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం హనుమంతు తీవ్ర స్థాయిలో గొడవ పడడంతో ఇక తాను కాపురానికి రానంటూ చెప్పి ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని పిలుచుకుని తన పుట్టింటికి లక్ష్మీదేవి వెళ్లిపోయింది. విషయాన్ని పెద్ద మనుషుల దృష్టికి తీసుకెళితే వారు కూడా హనుమంతును మందలించారు. తాగుడు మానేసి, బుద్ధిగా భార్యాపిల్లలను పోషించుకుంటానంటే తాము జోక్యం చేసుకుని సర్దిచెబుతామంటూ తేల్చి చెప్పారు. దీంతో దిక్కుతోచని హనుమంతు గురువారం తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హిందూపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి మరో వ్యక్తి...

హిందూపురం అర్బన్: గూడ్స్ రైలు కిందపడి మడకశిరకు చెందిన రాజు (39) ఆత్మహత్య చేసుకన్నాడు. శుక్రవారం వేకువజామున హిందూపురం రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మడకశిరలోని ఎస్సీ కాలనీకి చెందిన రాజు కుటుంబంలో ఆస్తి పంపకాల్లో విభేదాల ఉన్నట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినట్లు జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపారు. కాగా, ఆయనకు ఇంకా పెళ్లి కాలేదు. తండ్రి, తమ్ముడు ఉన్నారు. తమ్ముడు రాజా ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ధర్మవరంలో మరొకరు...



మృతుడు హరేరామ్

ధర్మవరం అర్బన్: స్థానిక డీఎల్ఆర్ కాలనీ సమీపంలో నివాసముంటున్న హరేరామ్ (48) ఆత్మహత్య చేసుకున్నాడు. రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న ఆయన జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం ఇంటి సమీపంలోని పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడ్డాడు. ఆయనకు భార్య అశ్వత్థమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

బత్తలపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరులో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ఈదుల ముష్టూరుకు చెందిన గుజ్జల శ్రీరాములు, అశ్విని దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయంతో పాటు కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో శ్రీరాములు మద్యానికి బానిసయ్యాడు. అశ్విని పలుమార్లు వేడుకున్నా ఆయనలో మార్పు రాలేదు. బుధవారం సాయంత్రం మద్యం మత్తులో శ్రీరాములు ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో అశ్విని ఆయనతో గొడవపడింది. సంపాదనంతా తాగుడుకే ఖర్చు పెడితే ఇల్లు ఎలా గడుస్తుందని నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో అశ్విని వెంటనే పురుగుల మందు తాగింది. గమనించిన శ్రీరాములు కూడా ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన పిల్లలు గట్టిగా ఏడుస్తుండడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని దంపతులను వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఇద్దరికీ ప్రాణాపాయం తప్పినట్లు బంధువులు తెలిపారు.కాగా, ఘటనపై ఎలాంటి ఫిర్యాదు లేనందున కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

'నోబుల్ వరల్డ్ రికార్డ్స్'లో రామగిరి చిన్నారికి చోటు



చిన్నారి హన్విక తో తల్లిదండ్రులు

రామగిరి: మండలంలోని కలికివాండ్లపల్లి గ్రామానికి చెందిన చిన్నారి హన్వికాకు నోబుల్ వరల్డ్ రికార్డ్ బుక్‌లో చోటు దక్కింది. గ్రామానికి చెందిన సుధీర్‌రెడ్డి, అఖిల దంపతులకు 7 నెలల వయసున్న చిన్నారి హన్వికా ఉంది. ఏదైనా పేరు చెబితే దాని ఆకారంలో ఉన్న కార్డును చిన్నారి గుర్తిస్తూ వస్తోంది. ఇలా దాదాపు 300 రకాల వస్తువులను చిన్నారి గుర్తిస్తుండడాన్ని కుటుంబసభ్యులు వీడియో తీసి తమిళనాడులోని కొయంబత్తూరుకు చెందిన నోబుల్ వరల్డ్ రికార్డ్ బుక్ నిర్వాహకులకు పంపారు. చిన్నారి హన్విక ప్రతిభను గుర్తిస్తూ వారు బుక్‌లో చోటు కల్పించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం రామగిరి జరిగిన ఓ కార్యక్రమంలో చిన్నారిని, ఆమె తల్లిదండ్రులను అభినందించారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

కదిరి అర్బన్: మండలంలోని మొటుకుపల్లి సమీపంలో కోడి పందేలు ఆడుతున్న 16 మందిని అరెస్ట్ చేసినట్లు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పీఎస్ సీఐ మోహన్ తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. అందిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం మొటుకుపల్లి వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పట్టుబడిన 16 మంది నుంచి రూ.70,110 నగదు, 17 ద్విచక్ర వాహనాలు, 15 సెల్‌ఫోన్లు, 4 కోళ్లు, 4 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కోడి పందెం నిర్వాహకులు రవీంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, లోకేష్‌తో పాటు మరో పది మంది పరారీలో ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, పరారీలో ఉన్న నిర్వాహకులతో పాటు పది మంది పందెంరాయుళ్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్‌హెచ్–342, ఎన్‌హెచ్–716జీ, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో జాతీయ రహదారుల కోసం సేకరించిన భూములు, రైతులకు చెల్లించిన నష్టపరిహారం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆయా మండలాల్లో పెండింగ్‌లో ఉన్న పనుల గురించి ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌హెచ్–342 (ముదిగుబ్బ–కోడూరు), ఎన్‌హెచ్–716జీ (బి.కొత్తపల్లి–గోరంట్ల–హిందూపురం), ఎన్‌హెచ్– 544 జీ(బెంగళూరు –కడప–విజయవాడ) రహదారులకు సంబంధించి అవార్డు పాస్ చేసిన భూములను ఎన్‌హెచ్ యాక్ట్ ప్రకారం వెంటనే సేకరించాలన్నారు. ఇందులో ఎలాంటి జాప్యం పనికిరాదన్నారు. పుట్టపర్తి, కప్పలబండ, పెడబల్లి, గోరంట్ల, గానివారి పల్లి, ముత్యాల చెరువు కదిరి తదితర ప్రాంతాల్లో భూసేకరణలో సమస్యలున్నాయని, ఆయా ప్రాంతాల ఆర్డీఓలు, తహసీల్దార్లు చొరవ తీసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. రైతులకు వీలైనంత త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపుల విషయంలో ఎలాంటి సమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో జాతీయ రహదారుల శాఖ డీఈ గిడ్డయ్య, నేషనల్ హైవే మేనేజర్ ముత్యాలరావు, భూసేకరణ విభాగం అధికారులు, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న 'సాక్షి' ఫొటోగ్రాఫర్



హైకోర్టు జడ్జి జస్టిస్ కె.మన్మథరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సాక్షి ఫొటోగ్రాఫర్ మహబూబ్ బాషా

అనంతపురం కల్చరల్: సాక్షి దినపత్రిక ఫొటోగ్రాఫర్ దూదేకుల మహబూబ్ బాషా (డీఎం బాషా) జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి వారి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నెల ఆరంభంలో సంభవించిన వరదలపై డీఎం బాషా తీసిన ఫొటోను నిర్వాహకులు అవార్డుకు ఎంపిక చేశారు. విజయవాడ వేదికగా శుక్రవారం రాత్రి బహుమతుల ప్రదానం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు, అకాడమీ నిర్వాహకులు డాక్టర్ సుందర్ కొంపల్లి, గోళ్ల నారాయణరావు, శ్రీనివాస రెడ్డి తదితరుల చేతుల మీదుగా డీఎం బాషా అవార్డు అందుకున్నారు.

యువకుడికి కత్తిపోట్లు

హిందూపురం అర్బన్: స్థానిక మున్సిపల్ పరిధిలోని మోతుకపల్లిలో శుక్రవారం సాయంత్రం ఇద్దరు యువకుల మధ్య చోటు చేసుకున్న చిన్నపాటి గొడవ చివరకు కత్తిపోట్లకు దారి తీసింది. గతంలో మంచి స్నేహితులుగా ఉన్న చందు, రోహిత్... డబ్బు విషయంగా మనస్పర్థలు రేగడంతో విడిపోయారు. ఈ క్రమంలో మోతుకపల్లి వద్ద టీ బంక్ నడుపుతున్న చందు వద్దకు శుక్రవారం సాయంత్రం రోహిత్ వెళ్లి డబ్బు విషయంగా గొడవ పడ్డాడు. అసహనానికి గురైన చందు కత్తితో రోహిత్‌పై దాడి చేయడంతో ఎడమచేతిపై తీవ్ర గాయమైంది. ఘటనపై ఎస్‌ఐ శ్రీధర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా కొల్లాపురమ్మ రథోత్సవం





రథాన్ని లాగుతున్న భక్తులు, రథంపై అధిష్టింపజేసిన కొల్లాపురమ్మ దేవి ఉత్సవమూర్తి

చెన్నేకొత్తపల్లి: స్థానిక దళిత వాడలో కొలువైన గ్రామ దేవత కొల్లాపురమ్మదేవి రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా సాగింది. ఏటా దీపావళి సందర్భంగా రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో నూతన దేవాలయం నిర్మించిన తర్వాత తొలి రథోత్సవం కావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. గురువారం ఉదయం మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని రథంపై అధిష్టింపజేసి మేళ తాళాలతో లాగారు.

భక్తి శ్రద్ధలతో బోనాలు..

దీపావళి మరుసటి రోజున అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

వివాహిత దారుణ హత్య



మెహతాజ్ మృతదేహం

- ప్రియుడిపైనే అనుమానాలు

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్లలో గురువారం అర్ధరాత్రి ఓ వివాహిత హత్యకు గురైంది. అనుమానంతో ప్రియుడే ఆమెను అంతమొందించినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలిపిన మేరకు.... కొండకమర్లకు చెందిన గొర్ల అల్లాబకాష్‌కు నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె మెహతాజ్ (32)కు 14 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన షేక్ బాబ్జాన్‌తో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం సాయంత్రం మెహతాజ్ పిల్లలతో కలసి పుట్టింటికి వచ్చింది. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి బయట శబ్దం రావడంతో ఇంట్లో నిద్రిస్తున్న వారు మేల్కొని బయటకు వచ్చారు. కొండకమర్ల గ్రామానికి చెందిన యువకుడు షేక్ ఇర్ఫాన్ బాషా గోడ దూకి పారిపోవడాన్ని గమనించి, చుట్టుపక్కల పరిశీలించారు. మెట్ల వద్ద మెహతాజ్ మృతదేహాన్ని గుర్తించారు. ఇర్ఫాన్‌బాషా ఆమెను హతమార్చి మృతదేహాన్ని మెట్లపై నుంచి కిందకు పడేసినట్లు నిర్ధారించుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కాగా, చాలా ఏళ్లుగా మెహతాజ్, ఇర్ఫాన్ బాషా మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లుగా ప్రాథమిక విచారణలో పోలీసులు నిర్ధారించారు. ఇటీవల ఆమె మరొకరితో సన్నిహితంగా ఉంటోందన్న అనుమానంతో ప్రియుడే ఆమెను హతమార్చి పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. అయితే పోలీసులు ఈ విషయాన్ని ధ్రువీకరించాల్సి ఉంది.

వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై దాడికి యత్నం



ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి ఇంటి ఎదుట చేరిన జనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఐదు నెలల కాలంలో చెన్నేకొత్తపల్లి మండల వ్యాప్తంగా రోజూ ఏదో ఒక ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ నేతలు, సానుభూతిపరులపై టీడీపీ నేతలు దాడులకు తెగబడుతూనే ఉన్నారు. తాజాగా శుక్రవారం రాత్రి సీకేపల్లిలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ నేత ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడికి టీడీపీ నాయకులు విఫల యత్నం చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి రావడంతో ఆయనను ఎస్టీడీ శ్రీనివాసరెడ్డితో పాటు మహేశ్వర్‌రెడ్డి కలిశారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు రాత్రి పెద్ద సంఖ్యలో ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడికి తెగబడ్డారు. అయితే సకాలంలో స్పందించిన సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది అక్కడకు చేరుకోవడంతో టీడీపీ నాయకులు, అనుచరులు ఉడాయించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి ఇంటివద్దకు చేరుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అక్కడి నుంచి అందరూ వెళ్లిపోవాలని సీఐ సూచించారు. అయితే ప్రశాంతతను కోరుకుంటున్న తమపై దాడికి యత్నిస్తే సహించబోమని టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎంతటివారినైనా వదిలబోమని సీఐ భరోసానివ్వడంతో అక్కడి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లిపోయారు.